www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..


పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 78 | గురువారం | 29 అక్టోబర్, 2026

20 సెకన్లలో చేజారిన స్వర్ణం

7



- ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో రజతంతో సరిపెట్టుకున్న కాజల్
- పతక పోరులో పరాజయం

అర్నాబ్ బీభత్సం

ఏపీ వద్ద తీరాన్ని దాటిన తుపాను.. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో భారీ వర్షాలు

చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలి ఏడుగురి మృతి

కొన్ని ప్రాంతాల్లో 30 సెం.మీ. వర్షపాతం.. 135 కి.మీ. వేగంతో ఈదురుగాలులు

ఒడిశాలో 30వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు

నష్టంపై అంచనాకు కేంద్ర బృందాన్ని పంపాలని ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

తీవ్ర తుపాను 'అర్నబ్' ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటడంతో ఏపీ, ఒడిశాలో భారీ వర్షాలు, బలమైన గాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. రహదారులు దెబ్బతినగా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఒడిశాలో 30 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏపీలో 13 జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక జారీ అయింది. తుపాను ప్రభావంతో 22 రైళ్ల రాకపోకలు రద్దు కాగా, మరికొన్నింటి ప్రయాణ మార్గాల్లో మార్పులు చేశారు.

2



తాగునీటికి ఆటంకం ఉండొద్దు

- హైదరాబాద్‌లో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఎస్టీపీలు వంద శాతం పనిచేయాల్సిందే
- పార్కులు, రోడ్లు, పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటినే వాడాలి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే విధానాన్ని విస్తృతం చేయాలని స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, ఎస్టీపీల పనితీరు, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో పచ్చదనం నిర్వహణకు తాగునీటిని వినియోగించకుండా శుద్ధిచేసిన నీటినే ఉపయోగించాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, తరువాయి 2లో..



లెక్క తేల్చాల్సిందే

జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ పెట్టాలి

- తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- రిజర్వేషన్లే భావితరాలకు ఆస్తి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2

అరంగేట్రం అదుర్స్

- స్టాక్ మార్కెట్లో అదరగొట్టిన జియో
- ఇష్యూ ధరతో పోలిస్తే 27శాతం లాభపడ్డ షేర్లు
- దేశంలో రెండో విలువైన సంస్థగా అవతరణ

స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసిన తొలిరోజే జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అదరగొట్టింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మద్దతున్న ఈ డిజిటల్ సేవల సంస్థ షేర్లు ఇష్యూ ధరతో పోలిస్తే దాదాపు 27 శాతం లాభపడ్డాయి. దీంతో మార్కెట్ విలువ పరంగా దేశంలో రెండో అత్యంత విలువైన సంస్థగా అవతరించింది. బుధవారం బీఎస్ఈలో షేరు రూ.1,417.35 వద్ద ముగిసింది. ఇష్యూ ధర రూ.1,119తో పోలిస్తే 26.66 శాతం పెరిగింది.

2

ఢిల్లీకి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలి

- రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ ఆందోళన
- పీసీసీ చీఫ్ సహా పలువురు నేతల అరెస్ట్

2



సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. రైల్వే జీఎం కార్యాలయం ఎదుట బుధవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కోరింది.

ప్రతిపక్ష నేతలను నిర్బంధం దుర్మార్గం

- ఇందిరమ్మ పాలన అంటే నాటి ఎమర్జెన్సీ రోజులేనని సీఎం గుర్తుచేశారు: కేటీఆర్

మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ పాలన అంటే ఆనాటి ఎమర్జెన్సీ రోజులే అని మరోసారి గుర్తుచేసిన ముఖ్యమంత్రికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ గొంతు నొక్కే ఇలాంటి కుట్రలను ఎట్టిపరిస్థితులో నహించే ప్రసక్తే లేదన్నారు. ఓవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు విలయతాండవం చేస్తుంటే.. లక్షన్నర కోట్ల లూటీకి సీఎం రేవంత్ రెడ్డి స్కెచ్ వేయడం సిగ్గుచేటు అని ఆరోపించారు.

2





వైద్య రంగంలో ఏఐ విప్లవం!

2

- వ్యాధుల గుర్తింపులో కృత్రిమ మేధ
- చైనా పోటీతో ఆసియాన్ దేశాలకు కొత్త అవకాశాలు



లెక్క తేల్చాల్సిందే

- జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ పెట్టాలి
- అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- రిజర్వేషన్లే భావితరాలకు ఆస్తి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ, హైదరాబాద్: జనగణనలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రం అంగీకరించకపోతే రాష్ట్రంలో జనగణనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లే భావితరాలకు మనమిచ్చే అమూల్యమైన ఆస్తి అని పేర్కొన్నారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, తెలంగాణ బీసీ రైట్స్ ఫోరమ్ సంయుక్తంగా బుధవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన 'హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్' సభలో కవిత మాట్లాడారు. తమిళనాడు తరహాలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని కోరారు. జనగణన కోసం కేంద్రం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ఓబీసీల జనాభా లెక్కలు తేల్చకపోవడం సరికాదన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్‌తోపాటు జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్, డ్రాప్‌డౌన్ బాక్స్ ఉండాలని డిమాండ్ చేశారు.

బీసీలకు అన్యాయం

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ప్రకటించిన సీఎం, 30 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లినా ఆ హామీని అమలు చేయలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లను తొలగించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీల జనాభా లెక్కలు తేలితే వారి వాటా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. ఒకే కులానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న పేర్లను గుర్తించి, జనాభాను సమగ్రంగా లెక్కించాలని సూచించారు. దేశ వార్షిక బడ్జెట్ సుమారు రూ.50 లక్షల కోట్లు ఉన్నా బీసీల కోసం ఏటా రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిపి కల్పించినట్లు చెబుతున్న రెండు లక్షల ఉద్యోగాల్లో లక్ష ఉద్యోగాలు బీసీలకు దక్కేవని అన్నారు. బీసీల హక్కుల సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల పరిరక్షణ కోసం నవంబర్‌లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓబీసీ సంఘాలు నిర్వహించే ధర్నాలో పాల్గొంటామని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ల కోసం పోరాడిన తరహాలోనే ఓబీసీల హక్కుల కోసం ఉద్యమిస్తామని చెప్పారు.

కవిత పోరాటం మోదీ కుర్చీ కదిలిస్తుంది

ఓబీసీల హక్కుల కోసం కవిత చేస్తున్న పోరాటం తుపానులా మారి ప్రధాని మోదీ అధికార పీఠాన్ని కదిలిస్తుందని ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్ అన్నారు. భవిష్యత్తులో కవిత తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. కీలకమైన పదవుల్లో ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వాలు 42 ఏళ్లుగా బీసీలను మోసం చేస్తున్నాయని రైట్స్ ఆఫ్ ఓబీసీ పార్టీ అధ్యక్షుడు తిరు రత్న సభాపతి విమర్శించారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో దేశవ్యాప్తంగా ఓబీసీ హక్కుల కోసం పోరాడుతున్న పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ డిక్లరేషన్ ప్రధాన డిమాండ్లు

- జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్,
  ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ ఏర్పాటు చేయాలి
- విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలి
- 50శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి
- విశ్వవిద్యాలయాల్లో సామాజిక న్యాయం అమలు చేయాలి
- ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి
- రాష్ట్రంలో 42 శాతం, మధ్యప్రదేశ్‌లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

తాగునీటికి ఆటంకం ఉండొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు సంస్థతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. రోడ్ల శుభ్రత, మొక్కలకు నీరు పోయడం, భవన నిర్మాణ పనులకు ట్రీటెడ్ వాటర్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ రంగంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రైవేటు సంస్థలు, అపార్ట్‌మెంట్లలోనూ మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ వ్యవస్థలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

ఎస్టీపీల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ

క్యూర్ పరిధిలో ఇప్పటికే ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను మెరుగుపరచడంతోపాటు నిర్మాణంలో ఉన్న ప్లాంట్ల పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఎస్టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించి, నీటి శుద్ధి ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు, ప్లాంట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని ఎస్టీపీలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి, వాటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రాల నిర్వహణపై హైడ్రా నిరంతర నిఘా ఉంచాలని, లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దాలని పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న నీటి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే డేటా సెంటర్లు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సాధ్యమైనంత వరకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రైవేటు రంగంలో ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. శుద్ధి కేంద్రాల నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలను పరిశీలించాలని రెడ్కో అధికారులకు సూచించారు.

ట్యాంకర్లకు ట్రాకింగ్.. టోల్‌ఫ్రీ నంబర్

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కదలికలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నీటిని ఎక్కడి నుంచి తీసుకున్నారు? ఎక్కడికి సరఫరా చేస్తున్నారు? ఏ అవసరానికి వినియోగిస్తున్నారు? అనే వివరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ట్రీటెడ్ వాటర్ లభ్యత, సరఫరా, వినియోగంపై ప్రజలకు సమాచారం అందించేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, తాగునీటిని ఇతర అవసరాలకు వృథా చేయకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించేలా ప్రోత్సహించాలని తెలిపారు.

నవంబర్ 1 నుంచి అమలు

ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి సరఫరా, పునర్వినియోగానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలు నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అమలులో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు సీఎంకు వివరించారు. ఈ నీటికి ఎలాంటి ధర వసూలు చేయడం లేదని, రవాణా రుసుము మాత్రమే తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి.పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యరంగంలో ఏఐ విప్లవం!

- వ్యాధుల గుర్తింపులో కృత్రిమ మేధ
- చైనా పోటీతో ఆసియాన్ దేశాలకు కొత్త అవకాశాలు
- ఊపిరితిత్తులు, మెదడు, రొమ్ము క్యాన్సర్ల గుర్తింపునకు ఏఐ నమూనాలు
- వివిధ ఆసుపత్రుల స్కానింగ్ చిత్రాలను విశ్లేషించే సాంకేతికతపై పరీక్షలు
- చైనా, ఆగ్నేయాసియా దేశాల మధ్య వైద్య పరిశోధనలకు సహకారం
- వైద్యుల స్థానాన్ని భర్తీ చేయడం కాదు.. నిర్ధారణలో వారికి తోడ్పాటే లక్ష్యం



నానింగ్: వ్యాధులను వేగంగా గుర్తించడంతోపాటు వైద్య నిర్ధారణలో కచ్చితత్వాన్ని పెంచేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత కీలకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో చైనాలోని గ్వాంగ్జీ ప్రాంతం నానింగ్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన జాతీయ వైద్య చిత్రాల ఏఐ గుర్తింపు పోటీ.. చైనా, ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) మధ్య వైద్య రంగంలో సహకారానికి కొత్త అవకాశాలను తెరచింది. ఈ పోటీలో 1,332 బృందాలు నమోదు చేసుకోగా, 66 బృందాలు తుది దశకు చేరాయి. వివిధ దేశాలకు చెందిన పరిశోధకులు, వైద్య నిపుణులు, సాంకేతిక సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ) ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, ఎంఆర్ఐ ద్వారా మెదడు కణితులు, మామోగ్రఫీ ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడం సహా ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వైద్య చిత్రాల నాణ్యత, పరిమాణం పెరుగుతున్న కొద్దీ వాటిని పరిశీలించడం రేడియాలజిస్టులకు సవాలుగా మారుతోంది. గతంలో ఛాతీ సీటీ స్కాన్‌లో సుమారు 100 చిత్రాలు వస్తే.. ఇప్పుడు వేల సంఖ్యలో వస్తున్నాయి. వీటిలో చిన్నపాటి అసాధారణ మార్పులను సకాలంలో గుర్తించేందుకు ఏఐ ఉపయోగపడుతుంది. షాంఘైకి చెందిన 'సెన్స్‌లంగ్' బృందం ఊపిరితిత్తుల్లో అనుమానాస్పద గడ్డలను గుర్తించడం, వాటి లక్షణాలను విశ్లేషించడం, నివేదికలను రూపొందించడంలో వైద్యులకు తోడ్పడే ఏఐ సాధనాలను అభివృద్ధి చేసింది. వ్యాధుల పరీక్షలు, రోగుల తదుపరి పర్యవేక్షణలోనూ ఈ సాంకేతికతను ఉపయోగిస్తోంది.

ఆసుపత్రుల మధ్య వ్యత్యాసాలే సవాల్

ఒక పెద్ద ఆసుపత్రిలో సమర్థంగా పనిచేసే ఏఐ నమూనా.. వేరే ఆసుపత్రిలోనూ అదే ఫలితాలను ఇవ్వకపోవచ్చు. స్కానింగ్ పరికరాలు, చిత్రీకరణ పద్ధతులు మారడమే ఇందుకు కారణం. అందుకే ఈ పోటీలో వ్యాధులను గుర్తించే కచ్చితత్వంతోపాటు వివిధ పరికరాల నుంచి వచ్చిన వైద్య చిత్రాలను ఏఐ ఎంత సమర్థంగా విశ్లేషిస్తుందో కూడా పరీక్షించారు. ఆసియాన్ దేశాల్లో వైద్య సదుపాయాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, నిపుణుల లభ్యతలో వ్యత్యాసాలున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏఐ నమూనాలను రూపొందించడం కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు.

వైద్యులు–సాంకేతిక నిపుణుల సమన్వయం

రొమ్ము క్యాన్సర్ గుర్తింపు విభాగంలో గ్వాంగ్జీ ప్రాంత ప్రజా ఆసుపత్రి, స్థానిక సాంకేతిక సంస్థకు చెందిన బృందం ఏఐ నమూనాను అభివృద్ధి చేసింది. వ్యాధికి సూచనలుగా ఉండే రొమ్ము గడ్డలు, సూక్ష్మ కాల్షియం నిక్షేపాలను గుర్తించడంపై దృష్టి సారించింది. వైద్యులు తమ అనుభవంతో సాంకేతిక నిపుణులకు అవసరమైన సూచనలు అందించడం ద్వారా నమూనాను మెరుగుపరిచారు. సరిహద్దులు దాటి ఉమ్మడి పరిశోధనలకు కూడా ఇలాంటి సమన్వయం దోహదపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

ఆసియాన్‌తో ఉమ్మడి ప్రాజెక్టులు

వియత్నాంతో సరిహద్దును పంచుకునే గ్వాంగ్జీ ప్రాంతం.. చైనా, ఆసియాన్ దేశాల మధ్య సంబంధాలకు కీలక కేంద్రంగా ఉంది. చైనా–ఆసియాన్ కృత్రిమ మేధ అనువర్తన సహకార కేంద్రం, ఫాంగ్‌చెంగ్‌గాంగ్ అంతర్జాతీయ వైద్య సహకార ప్రయోగాత్మక ప్రాంతం వంటి వేదికలు ఈ రంగంలో భాగస్వామ్యానికి తోడ్పడుతున్నాయి. ఆసియాన్ దేశాలతో కలిసి వైద్య చిత్రాల ఏఐ నమూనాలను వివిధ ఆసుపత్రుల్లో పరీక్షించడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం, ప్రదర్శన ప్రాజెక్టులను చేపట్టడం గ్వాంగ్జీ ప్రణాళికలో భాగంగా ఉంది.

భద్రత, అనుమతులూ కీలకమే

వైద్య చిత్రాల సమాచారాన్ని ఆసుపత్రుల మధ్య పంచుకునేందుకు చైనా క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. తగిన భద్రతా చర్యలతో ఈ వ్యవస్థలు ఏఐ నమూనాల అభివృద్ధి, పరీక్షలకు ఉపయోగపడతాయని జిలిన్ విశ్వవిద్యాలయం తొలి ఆసుపత్రి రేడియాలజీ విభాగం డైరెక్టర్ ఝాంగ్ హుయ్‌మావో తెలిపారు. అయితే రోగుల సమాచారం గోప్యత, వైద్య విధానాలు, నియంత్రణ నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పోటీల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన ఏఐ సాధనాలు ఆసుపత్రుల్లో వినియోగానికి సిద్ధమైనట్లు కాదని, వివిధ ఆసుపత్రులు, పరికరాలు, రోగుల సమూహాలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన అనుమతులు పొందాలని సూచిస్తున్నారు.

వైద్యుల నిర్ణయమే అంతిమం

పోటీలో వెలుగుచూసిన సాంకేతికతలను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గ్వాంగ్జీ ప్రాంతం మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. నిపుణులైన వైద్యులు అందుబాటులో లేని ప్రాంతాల్లో అనుమానాస్పద లక్షణాలను త్వరగా గుర్తించేందుకు ఏఐ ఉపయోగపడే అవకాశముంది. అయితే రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, ఇతర పరీక్షల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోవాల్సింది వైద్యులే. ఏఐ వారి స్థానాన్ని భర్తీ చేయడానికి కాకుండా, నిర్ధారణ ప్రక్రియను మరింత సమర్థంగా మార్చడానికి ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.



ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం దుర్మార్గం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజానావ, హైదరాబాద్: మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ పాలన అంటే ఆనాటి ఎమర్జెన్సీ రోజులే అని మరోసారి గుర్తుచేసిన ముఖ్యమంత్రికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ గొంతు నొక్కే ఇలాంటి కుట్రలను ఎట్టిపరిస్థితుల్లో సహించే ప్రసక్తే లేదన్నారు. ఓవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు విలయతాండవం చేస్తుంటే.. లక్షన్నర కోట్ల రూపాయాల లూటిఫికేషన్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్కెచ్ వేయడం సిగ్గుచేటు అని ఆరోపించారు. లక్షలాది మంది రైతులు కరువులో నిండా మునిగి కన్నీళ్లు పెడుతుంటే ముఖ్యమంత్రి మాత్రం మూసీలో మూటలవేట సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు కనీసం రూ.50వేల పరిహారం ఇవ్వాల్సిన రేవంత్ రెడ్డి పూర్తిగా చేతులెత్తేసి అన్నదాతలకు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. మూసీలో దోపిడీయే తన తొలి ప్రాధాన్యమని చాటిచెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ తీరు చూసి ఇవాళ 70లక్షల మంది రైతులు అసహ్యించుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. మూసీ లూటిఫికేషన్ ముసుగులో లక్షల కుటుంబాల ఇళ్లు కూల్చి, రియల్ ఎస్టేట్ దందా చేయాలనే రేవంత్ పన్నాగాన్ని అడ్డుకునే వరకూ బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఢిల్లీకి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలి

- రైల్ నిలయం వద్ద కాంగ్రెస్ ఆందోళన
- పీసీసీ చీఫ్ సహా పలువురు నేతల అరెస్ట్

ప్రజానావ, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. రైల్వే జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయితే ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు ముఖ్య నేతలు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. జీఎంను కలిసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించగా లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు రైల్ నిలయం ఎదుట బైఠాయించి, ధర్నా చేపట్టారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే తమ పార్టీకి అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, గణేష్ సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఢిల్లీలో జరగనున్న నిరసన ర్యాలీకి వెళ్లకుండా ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తాయని నేతలు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తమ ఆందోళన లక్ష్యమని పేర్కొన్నారు.

అర్నబ్ బీభత్సం

- ఏపీ వద్ద తీరాన్ని దాటిన తుపాను
- ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో భారీ వర్షాలు
- చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలి ఏడుగురి మృతి



అమరావతి/భువనేశ్వర్/న్యూఢిల్లీ: తీవ్ర తుపాను 'అర్నబ్' ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటడంతో ఏపీ, ఒడిశాలో భారీ వర్షాలు, బలమైన గాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. రహదారులు దెబ్బతినగా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఒడిశాలో 30 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏపీలో 13 జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక జారీ అయింది. తుపాను ప్రభావంతో 22 రైళ్ల రాకపోకలు రద్దు కాగా, మరికొన్నింటి ప్రయాణ మార్గాల్లో మార్పులు చేశారు. బుధవారం తెల్లవారుజామున కాకినాడ–యానాం మధ్య అర్నబ్ తుపాను తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, అప్పుడప్పుడు 150 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నాయని ఐఎండీ వెల్లడించింది. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో అక్టోబర్ 27 ఉదయం నుంచి 28వ తేదీ తెల్లవారుజాము వరకు పలు ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురిసింది. కాకినాడ, విశాఖపట్నం సహా ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారులపై చెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

13 జిల్లాలకు వరద ముప్పు

బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఐఎండీ ఆకస్మిక వరదల హెచ్చరిక జారీ చేసింది. గురువారం ఉదయం వరకు నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో మధ్యస్థం నుంచి భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపింది. తుపాను క్రమంగా బలహీన పడే అవకాశమున్నప్పటికీ, ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అధికారులు సూచించారు.

కేంద్ర బృందాన్ని పంపించండి: చంద్రబాబు

తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర కేంద్ర సంస్థల సహాయాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 80 ఇళ్లు దెబ్బతిన్నాయని, వాటిలో ఎక్కువ భాగం కోనసీమ జిల్లాలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోగా, 170కిపైగా తొలగించినట్లు వివరించారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఒడిశాలో భారీగా సహాయక చర్యలు

తుపాను ప్రభావంతో దక్షిణ ఒడిశాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మల్కాన్‌గిరి, గంజాం, గజపతి, రాయగడ, కోరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో లోతట్టు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను తరలించారు. మొత్తం 2,037 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఆహారం, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు. 30 జిల్లాల్లో 16 జిల్లాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. గజపతి, గంజాం, రాయగడ, కోరాపుట్, నబరంగ్‌పూర్, మల్కాన్‌గిరి జిల్లాలకు అత్యంత భారీ వర్షాల హెచ్చరిక జారీ అయింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 60–80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని ఐఎండీ తెలిపింది. ఇతర జిల్లాల్లోనూ ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. పూరీ తీరంలో సముద్రపు అలలు ఉధృతంగా ఎగసిపడ్డాయి. కాకినాడ–యానాం పరిసరాల్లో సముద్రపు నీరు సాధారణ స్థాయి కంటే 1.5–2.5 మీటర్ల మేర ఎగసిపడే ప్రమాదం ఉందని అధికారులు ముందుగా హెచ్చరించారు. తుపాను ప్రభావంతో పశ్చిమ బెంగాల్ తీరప్రాంత, దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అక్టోబర్ 31 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగవచ్చని ఐఎండీ అంచనా వేసింది. ఉప హిమాలయ ప్రాంతాల్లోనూ శనివారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

22 రైళ్ల సేవలకు అంతరాయం

అర్నబ్ ప్రభావంతో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 మధ్య కనీసం 22 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల సేవలను రద్దు చేయడం లేదా తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. విశాఖపట్నం–కిరండూల్, రూర్కెలా–జగదల్‌పూర్, హౌరా–జగదల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ప్రభావం పడింది. భువనేశ్వర్–జగదల్‌పూర్ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 27 నుంచి 30 వరకు రాయగడ వరకే నడవనుండగా, తిరుగు రైలు అక్టోబర్ 28 నుంచి 31 వరకు రాయగడ నుంచే బయలుదేరనుంది. ప్రయాణికులు రైళ్ల తాజా వివరాలు తెలుసుకుని ప్రయాణాలు ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.



స్పెయిన్‌లోని టోలెడో ప్రావిన్స్‌లో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కనీసం 50మంది మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. క్షతగాత్రులు, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు పేర్కొంది. ఘటనపై ప్రధాని పెడ్రో శాంచెజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. – మాడ్రిడ్



పట్టభద్రుల ఓటర్ల నమోదుపై బీఆర్ఎస్ దృష్టి

- 15 వేల ఓటర్ల నమోదు లక్ష్యం..
- పార్టీ శ్రేణులు చొరవ చూపాలి
- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్


ప్రజానావ, సికింద్రాబాద్ : పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పాలనా యంత్రాంగం పకడ్బందీగా చేపట్టాలని, బీఆర్ఎస్ శ్రేణులు చొరవ తీసుకొని ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు అంశంపై బుధవారం సీతాఫలమండిలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 నాటికి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ఇప్పటివరకు సుమారు 4 వేల మంది పేర్లు నమోదయ్యాయని, కనీసం 15 వేల మంది ఓటర్ల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, యువజన, మహిళా, విద్యార్థి, కార్మిక విభాగాల ప్రతినిధులు, ఉద్యమకారులు, పోలింగ్ బూత్ కమిటీలు, బస్తీ కమిటీలు, కాలనీ సంఘాలు ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. సికింద్రాబాద్‌లో పార్టీకి 220 పోలింగ్ బూత్ కమిటీలు ఉన్నాయని, ప్రతి బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్‌తో పాటు కుల, కార్మిక సంఘాలు, పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలతో పార్టీ శ్రేణులకు సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజూ కనీసం రెండు గంటల సమయం కేటాయించి పట్టభద్రుల ఓటర్ల నమోదుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ యువనేత కిషోర్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, అలకుంట సరస్వతి హరి, సమన్వయకర్తలు రాజ సుందర్, రాజేందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగం చేస్తే సహించం

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను వేధించేందుకు పోలీసులతో సహా ప్రభుత్వ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే తీవ్రంగా స్పందిస్తామని పద్మారావు గౌడ్ హెచ్చరించారు. సమావేశంలో పలువురు నాయకులు ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా, పార్టీ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా ట్రెసా రూ.5 లక్షల విరాళం

ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు సీఎం సహాయనిధికి ఆర్థిక సాయం



ప్రజానావ, హైదరాబాద్ : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5 లక్షల విరాళం ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే అవకాశం ఉన్న కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడంతోపాటు ప్రభుత్వానికి సహకరించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్. రమణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి అందించనున్న రూ.5 లక్షల విరాళం చెక్కును మంత్రికి అందజేసి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించింది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతని ట్రెసా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించేందుకు ఉద్యోగ సంఘాలు కూడా ముందుండాలని వారు తెలిపారు.

కన్నబిడ్డను చంపి.. దంపతుల ఆత్మహత్య

- కూకట్‌పల్లిలో విషాద ఘటన
- ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల ప్రాథమిక అంచనా

ప్రజానావ, హైదరాబాద్ : ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. పండంటి పాపకు జన్మనిచ్చారు.. సంతోషంగా సాగుతుందనుకున్న వారి జీవితంలో విషాదం చోటుచేసుకుంది. రెండేళ్ల కూడా నిండని చిన్నారిని హతమార్చి, దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లా రాధామోహన్‌పూర్‌కు చెందిన గోపీనాథ్ బుయిన్ (30), సమత (26) 2023లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి 23 నెలల కుమార్తె స్నిగ్ధ ఉంది. రెండేళ్లుగా కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లో నివాసముంటున్న గోపీనాథ్ గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో వంటవాడిగా పనిచేస్తున్నాడు. అతడి సోదరులు ఎల్బీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో వంటవారిగా పనిచేస్తున్నారు. ప్రతిరోజూ చిన్నారి స్నిగ్ధతో ఆడుకునే ఎదురింటి వృద్ధుడు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు వారి ఇంటి తలుపులు తెరవక పోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో కేపీహెచ్‌బీ పోలీసులు ఇంటి తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా, భోజనాల గదిలో దంపతులు ఉరివేసుకుని కనిపించారు. పడకగదిలో చిన్నారి విగతజీవిగా పడి ఉంది. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దంపతులు మరణించి సుమారు పది గంటలు అయి ఉండవచ్చని తెలిపారు. చిన్నారి మరణానికి గల కారణాలు, ఆమెను ఎలా హతమార్చారనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో తేలాల్సి ఉందన్నారు. ప్రాథమిక విచారణలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా దంపతులు ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోంది.







కలలకు ఊపిరి పోయండి.. మత్తుకు కాదు

- 2029 నాటికి నషా ముక్త్ తెలంగాణే లక్ష్యం కావాలి
- విద్యాసంస్థల్లో ప్రవేశ సమయంలోనే మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించాలి
- విద్యార్థులు, యువతలో చైతన్యానికి 60 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ఓయూలో అవగాహన కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు

ప్రజానావ, హైదరాబాద్ : యువత మత్తు మాయలో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తమ కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశ సమయంలోనే విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించే విధానాన్ని తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు వెల్లడించారు. నషా ముక్త్ తెలంగాణ సాధన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా కలిసికట్టుగా చేపట్టాల్సిన ప్రజా ఉద్యమమని స్పష్టం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ జాతీయ సేవా పథకం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్', 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్–2047' అవగాహన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు కర్మాగారాలు, గనుల్లో కాకుండా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడితే వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ లక్ష్యాలను సాధించడం కష్టమవుతుందని అన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తికే పరిమితం కాకుండా కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తుందని, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నషా ముక్త్ భారత్ లక్ష్యాన్ని నిర్దేశించారని, 2029 నాటికి దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం 'విజన్ డాక్యుమెంట్ ఆన్ డ్రగ్ కంట్రోల్ 2026–2029'ను రూపొందించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో 2029 నాటికి నషా ముక్త్ తెలంగాణ సాధించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని అవమానించడం, సమాజానికి దూరం పెట్టడం సరికాదని గవర్నర్ అన్నారు. వారికి సరైన వైద్యం, మానసిక కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సహకారం అందించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. 'మాదకద్రవ్యాలపై పోరాడాలి.. వ్యసనానికి గురైన వ్యక్తిపై కాదు' అనే దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. విద్యార్థుల చేతుల్లో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు ఉండాలని, వారి కళ్లలో విజయ లక్ష్యాలు కనిపించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, జీవిత లక్ష్యాలను సాధించడం, దేశాభివృద్ధికి తోడ్పడటం ప్రతి యువకుడి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 32 జిల్లా శాఖలకు నిర్వహణ కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయని, రెడ్‌క్రాస్ సభ్యత్వం 1.28 లక్షలు దాటిందని వివరించారు. జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల్లో 16 లక్షలకు పైగా నమోదు జరిగిందన్నారు. ఆపద మిత్ర కార్యక్రమంలో 6,000 మంది నమోదు కాగా, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సుమారు 50 వేల మంది సభ్యులున్నారని, మై భారత్ పోర్టల్‌లో 5.20 లక్షలకు పైగా యువత నమోదు చేసుకున్నారని వెల్లడించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2,000 మంది జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు ఆపద మిత్ర కార్యక్రమంలో చేరడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బాలల దినోత్సవం నవంబరు 14 నుంచి జాతీయ యువజన దినోత్సవం జనవరి 12 వరకు 60 రోజులపాటు ప్రత్యేక మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో సదస్సులు, ప్రదర్శనలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను యువతకు సులభంగా అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఈ దిశగా విశేష కృషి చేసిన విద్యాసంస్థలను గుర్తించి సత్కరించాలని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు కేవలం పట్టాలు అందించే కేంద్రాలుగా కాకుండా నైతిక విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభమైన అవగాహన స్ఫూర్తి రాష్ట్రంలోని ప్రతి పాఠశాల, కళాశాల, గ్రామం, ఇంటికి చేరాలని గవర్నర్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రజా ఉద్యమంగా మారాలని అన్నారు. ప్రతి విద్యార్థి అవగాహన రాయబారిగా మారి ఇతరులను కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రేరేపించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తామని, ఆరోగ్యవంతమైన మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు. 'మాదకద్రవ్యాలకు నో చెప్పండి.. జీవితానికి అవును చెప్పండి' అనే సందేశంతో యువత ముందుకు సాగాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో మార్పు తీసుకువచ్చే శక్తి ఉందని, ప్రతి యువకుడు సామాజిక మార్పునకు నాంది పలకగలడని పేర్కొన్నారు. సమష్టి కృషితో తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, విశ్వవిద్యాలయాలు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో పనిచేస్తూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే దేశాభివృద్ధికి బలమని, యువశక్తిని సద్వినియోగం చేసుకుని భారతదేశాన్ని ప్రపంచానికి మార్గదర్శకంగా నిలపాలని ఆకాంక్షించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ మాట్లాడుతూ.. తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచే శివ ప్రతాప్ శుక్లా మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. జిల్లాల పర్యటనలు, వివిధ వేదికల ద్వారా ఈ ముప్పుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని, యువ సైనికుడిలా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులకు అనుగుణంగా వ్యక్తిగతంగా, సమష్టిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. వందేమాతరం గీతం మాతృభూమి గొప్పతనాన్ని, వారసత్వాన్ని గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. గవర్నర్ చొరవతో తెలంగాణలో రెడ్‌క్రాస్ సభ్యుల సంఖ్య సుమారు 40 వేల నుంచి 1.28 లక్షలకు పెరిగిందని, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థుల సంఖ్య 17 వేల నుంచి సుమారు 1.20 లక్షలకు చేరిందని వెల్లడించారు. రాష్ట్రంలోని సుమారు 2,000 పాఠశాలల్లో స్కౌట్స్ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా గవర్నర్ నషా ముక్త్ భారత్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించి విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, రెడ్‌క్రాస్ సభ్యులతో కలిసి ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కొమండూరు శశికిరణ్, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రాములు, అధ్యాపకులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసింగ్‌లో ఏఐ సాంకేతికత

- ఫిర్యాదుల నమోదు మరింత సులభం
- పైలట్ ప్రాజెక్టుగా పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్ ఎంపిక
- 'సేతు' యాప్ పనితీరును పరిశీలించిన డీసీపీ శిల్పవల్లి

ప్రజానావ, హైదరాబాద్ : పోలీసు సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మరింత సులభంగా, సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిర్యాదుల నమోదు కోసం రూపొందించిన 'సేతు' యాప్ పనితీరును ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. యాప్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నిర్వాహకులను అడిగి దాని పనితీరు, ఉపయోగాల గురించి వివరాలు తెలుసుకున్నారు. చదువురాని వారు సైతం ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు నమోదు చేసుకునేలా ఈ అధునాతన విధానాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ఫిర్యాదుదారులు కాగితాలను ఉపయోగించాల్సిన అవసరం లేకుండా ఫిర్యాదు నమోదు యంత్రం ముందు నిలబడి తమ వివరాలను నమోదు చేయాలి. అనంతరం యంత్రం టోకెన్‌ను జారీ చేస్తుంది. ఆ తర్వాత సుమారు 30 సెకన్ల వ్యవధిలో ఫిర్యాదుదారులు తమ సమస్యలను వీడియో రూపంలో రికార్డు చేసే అవకాశం కల్పిస్తుంది. ఈ వీడియో రికార్డింగ్ ఆధారంగా ఫిర్యాదు సంబంధిత పరిపాలనా అధికారితో పాటు సంబంధిత సెక్టార్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు చేరుతుంది. కాగితాల అవసరం లేకుండా సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు చేరవేసేలా ఈ వ్యవస్థ పనిచేస్తుందని పోలీసులు తెలిపారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ఫిర్యాదుల నమోదు ప్రక్రియను సరళతరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ఈ పైలట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

పంచ పరివర్తనతో సమాజంలో సానుకూల మార్పులు

- నైతిక విలువలు, సంస్కారం, బాధ్యతాయుత పౌరసత్వంతోనే బలమైన దేశ నిర్మాణం
- పంచ పరివర్తన పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



ప్రజానావ, హైదరాబాద్ : సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, స్వబోధ, పౌర కర్తవ్యాలనే ఐదు సూత్రాలతో కూడిన పంచ పరివర్తన సమాజంలో సానుకూల మార్పులకు పునాది వేస్తుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. విద్య అనేది కేవలం జ్ఞానాన్ని, ఉపాధిని అందించే సాధనం మాత్రమే కాదని, నైతిక విలువలు, సంస్కారం, క్రమశిక్షణ, మానవత్వం, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందిస్తూ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, దేశం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించే స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'పంచ పరివర్తన' పుస్తకాన్ని బుధవారం సాయంత్రం లోక్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జ్ఞాన సంప్రదాయం విద్యను వ్యక్తిత్వ వికాసానికి, జీవిత నిర్మాణానికి పునాదిగా భావించిందని గుర్తుచేశారు. జ్ఞానంతో పాటు మానవత్వం, ఆధునికతతో పాటు సంస్కారం కలిగిన పౌరులను తీర్చిదిద్దడమే విద్య అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు. సామాజిక సామరస్యం ద్వారా పరస్పర గౌరవం, ఐక్యతను బలోపేతం చేయాలని, కుటుంబ విలువల ద్వారా పిల్లల్లో క్రమశిక్షణ, బాధ్యతను పెంపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకుంటూనే ఆధునిక విజ్ఞానాన్ని స్వీకరించాలని అన్నారు. హక్కులతో పాటు పౌర కర్తవ్యాలను కూడా నిజాయితీగా నిర్వర్తించినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. పంచ పరివర్తన సూత్రాలను ఆచరణలోకి తీసుకురావడంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం సమన్వయంతో కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, పంచ పరివర్తన భావనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందించారు.



బాలల రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన

వేధింపులకు గురైతే భయపడొద్దు.. పెద్దలకు తెలియజేయాలి

ప్రజానావ, మల్కాజిగిరి : బాలలపై లైంగిక నేరాలను అరికట్టడంతోపాటు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆశా లత, మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయ్ కుమార్, ప్రభుత్వ న్యాయ వాదులు పాల్గొని విద్యార్థులకు చట్టంలోని కీలక అంశాలను వివరించారు. పోక్సో చట్టం ప్రాధాన్యత, బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన నేరాలు, బాధితులకు చట్టం కల్పించే హక్కులు, నేరాలకు పాల్పడిన వారిపై తీసుకునే చట్టపరమైన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆపద ఎదురైనప్పుడు ధైర్యంగా స్పందించాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పెద్దలకు తెలియజేయాలని పేర్కొన్నారు. బాలల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు చట్టాలపై స్పష్టత కల్పించడంతోపాటు వారికి సురక్షిత వాతావరణం ఏర్పడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

వినికిడి లోపం ఉన్నవారి హక్కుల కోసం 'సైనథాన్ 3.0'

'సైగ చేద్దాం.. మద్దతు ఇద్దాం.. శక్తినిద్దాం' నినాదంతో అవగాహన పరుగు

ప్రజానావ, హైదరాబాద్ : సైనథాన్ అనేది కేవలం పరుగు మాత్రమే కాదని, వినికిడి లోపం ఉన్నవారి సమస్యలు, హక్కులపై సమాజానికి అవగాహన కల్పించే గొప్ప ప్రయత్నమని క్వాల్‌కమ్ సీనియర్ డైరెక్టర్ నితిన్ శర్మ, స్టేట్ స్ట్రీట్ ఏవీపీ నీతూ చద్దా అన్నారు. 'సైగ చేద్దాం.. మద్దతు ఇద్దాం.. శక్తినిద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమం సాగుతుందని పేర్కొన్నారు. శ్రీనగర్ కాలనీలో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31న పీపుల్స్ ప్లాజాలో నిర్వహించనున్న 'సైనథాన్ 3.0' అవగాహన పరుగుకు సంబంధించిన జెర్సీ, గూడీ బ్యాగులు, పోస్టర్‌ను సంస్థ డైరెక్టర్ డీపీకే బాబుతో కలిసి వారు ఆవిష్కరించారు. భారతీయ సంకేత భాషపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతోపాటు వినికిడి లోపం ఉన్నవారి హక్కులు, సమస్యలను సమాజానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ పరుగును నిర్వహిస్తున్నట్లు డీపీకే బాబు తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారికి సమాజం నుంచి మద్దతు లభించేలా చూడటంతో పాటు వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు సైనథాన్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

30 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు

- తుంగతుర్తి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- మరో 2,000 ఇళ్లు రానున్నాయి ఎమ్మెల్యే మందుల సామేలు

ప్రజానావ, బోడుప్పల్ : రాష్ట్రంలో గుడిసెలు లేని పరిస్థితిని తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని తన నివాసంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పట్టాలను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గానికి ఇప్పటివరకు 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, త్వరలో మరో 2,000 ఇళ్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందించి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇళ్లు అందించామని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు. అయితే, గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కల్పనపై నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పేదలకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మందుల సామేలు, తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ నేతల సమాలోచన

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కాంగ్రెస్ నేతల భేటీ

ప్రజానావ, సత్తుపల్లి : ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి పార్టీ నాయకులు సమన్వయంతో కృషి చేయాలని చర్చించారు. ఈ మేరకు నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి తన బృందంతో కలిసి మంగళవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల సమన్వయం, పట్టభద్రుల ఓటర్లను సంప్రదించడం, ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నకేశవరావు, కమల్ పాషా, దేవి శ్రీనివాసరావు, నాగభూషణం, బత్తుల భరత్, మల్లూరు దిలీప్, మట్టా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అక్టోబరు 30 సాయంత్రం వరకు వర్ష సూచన
- అత్యవసరమైతేనే బయటకు రావాలి



ప్రజానావ, జూలూరుపాడు : అర్ణబ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో బుధవారం రాత్రి నుంచి అక్టోబరు 30 సాయంత్రం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ప్రయత్నించకూడదని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారుల సూచనలు పాటించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తలసేమియా చిన్నారుల కోసం పోలీసుల రక్తదాన శిబిరం

- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సేవా కార్యక్రమం
- రక్తదాతలను అభినందించిన అదనపు ఎస్పీ

ప్రజానావ, మెదక్ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సహాయం అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలను అభినందిస్తూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. తలసేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు, యువత, ప్రజలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సైలు సుభాష్ గౌడ్, గంగరాజు, మధుకర్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే–ఐజేయూ నేతల వినతి

హెల్త్, అక్రిడిటేషన్ కార్డులూ మంజూరు చేయాలని విజ్ఞప్తి



ప్రజానావ, సంగారెడ్డి : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీయూడబ్ల్యూజే–ఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ కోరింది. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్‌లో మంగళవారం మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి నేతృత్వంలో నాయకులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని ఈ సందర్భంగా బండారు యాదగిరి పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టుల జాబితాను వెంటనే సేకరించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు లేక పేద జర్నలిస్టులు, వారి కుటుంబాలు వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హామీ ఇచ్చినప్పటికీ హెల్త్ కార్డులు మంజూరు చేయకపోవడం వల్ల జర్నలిస్టుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. ఇంకా అనేకమంది అర్హులకు అక్రిడిటేషన్ కార్డులు అందలేదని, వారికి కూడా వెంటనే కార్డులు జారీ చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందిస్తూ హైదరాబాద్ జర్నలిస్టులకు త్వరలో ఇంటి స్థలాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలోనూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



వరి కోతలు వాయిదా వేయండి

- ఆర్ణాబ్ తుఫాన్‌తో భారీ వర్ష సూచన
- ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజానావ, నల్లగొండ : ఆర్ణాబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మూడు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. వర్షాలకు కోసిన ధాన్యం తడిస్తే తేమ శాతం పెరిగి నాణ్యత దెబ్బతినడంతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు కోతలు చేపట్టవద్దని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం వర్షానికి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో నిల్వ ఉంచి, టార్పాలిన్లు, ఇతర కవర్లతో కప్పి రక్షించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంటలు వర్షాలకు తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా రైతులకు విస్తృతంగా సమాచారం అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి పంట నష్టాన్ని నివారించుకోవాలని కలెక్టర్ కోరారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- పరారీలో ఉన్న నలుగురు నిందితుల అరెస్ట్
- హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం



ప్రజానావ, కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామంలో సంచలనం సృష్టించిన మేడి అఖిల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సాంకేతిక బృందం సహకారంతో ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల తన సిబ్బందితో కలిసి కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో దంత్యాల గణేష్ అలియాస్ గని, సిరిపురం సాత్విక్ అలియాస్ చిన్ను, ముద్దంగుల వెంకటేష్ అలియాస్ చిన్ని, తరాల ప్రదీప్‌లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణ ప్రకారం గతంలో జరిగిన గొడవలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గణేష్, సాత్విక్‌లు అఖిల్‌పై పగ పెంచుకొని హత్యకు పథకం రచించారు. మద్యం తాగుదామని నమ్మించి అఖిల్‌ను ఎదురుగడ్డ గ్రామంలోని రేకుల షెడ్డు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ అక్టోబరు 19 తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గణేష్ కత్తితో అఖిల్ మెడపై పలుమార్లు పొడవడంతోపాటు సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేశాడని, సాత్విక్ కూడా ఇటుకతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. ఈ దాడిలో అఖిల్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. హత్యకు ముందస్తు పథకం రచించడంలో మిగిలిన నిందితులు కూడా సహకరించారని, మద్యం కొనుగోలు తదితర అవసరాల కోసం ఫోన్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిపినట్లు గుర్తించామని తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఫోన్‌పే లావాదేవీలకు సంబంధించిన తెరచిత్రాలు, హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. పాత గొడవలు, వ్యక్తిగత కక్షలతో హింసకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు. వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, కేసు ఛేదనలో సాంకేతిక బృందం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వేసంగి వరి సాగుకు నీరు విడుదల చేయొద్దు

- తాగునీటి అవసరాలకే తాలిపేరు జలాలు వినియోగించాలి
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి

ప్రజానావ, భద్రాచలం : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాలిపేరు ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది వేసంగి వరి సాగు చేయడానికి నీటిని విడుదల చేసే ప్రసక్తే లేదని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాగు నీటి, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలిపేరు ప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో పశువులను కాపాడుకోవడం కూడా ముఖ్యమని పేర్కొంటూ రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసం, సజ్జలు, జనుములు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా వేసంగి వరి పంటకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని విడుదల చేయకుండా, తాగునీటి అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే వేసంగి వరి సాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం తరఫున సరఫరా చేయకుండా చూడాలని, ప్రైవేటు విత్తన కంపెనీలు కూడా ఈ ఏడాది వరి విత్తనాలను సరఫరా చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని బట్టి వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సూచించారు.

తాళ్లగడ్డ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

- నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు చలానాలు

ప్రజానావ, మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గస్తీలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో 106 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఒక కారును తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రవితో పాటు డివిజన్ పరిధిలోని ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, 150 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ కాలనీల్లోకి కొత్త వ్యక్తులు అద్దెకు ఇల్లు కావాలని వస్తే వారి వివరాలను పూర్తిస్థాయిలో విచారించిన తర్వాతే ఇళ్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడితే పోలీసు శాఖ తరఫున కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ సూచించారు.



బొప్పాయి తోటలో నవజాత శిశువు లభ్యం

- అక్కున చేర్చుకున్న అంగన్వాడీ సిబ్బంది
- ప్రభుత్వ మాతా శిశు కేంద్రానికి తరలింపు

ప్రజానావ, ఖమ్మం : ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలం వి.ఆర్. బంజారా గ్రామ శివారులో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామ శివారులోని ఓ బొప్పాయి తోటలో అప్పుడే జన్మించిన మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. అటుగా వెళ్లిన అంగన్వాడీ సిబ్బంది శిశువును గమనించి వెంటనే స్పందించారు. శిశువును సురక్షితంగా ఖమ్మం ప్రభుత్వ మాతా శిశు కేంద్రానికి తరలించారు. కాగా, శిశువును అక్కడ వదిలివెళ్లిన వ్యక్తులు ఎవరనే విషయంపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నవజాత శిశువుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.



విద్యుత్ తీగలకు తాకి వరిగడ్డికి మంటలు

ప్రజానావ, వనపర్తి : వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలో వరిగడ్డి తరలిస్తున్న వాహనానికి ప్రమాదం తప్పింది. గుర్రంగడ్డ నుంచి పెబ్బేరుకు వరిగడ్డిని తరలిస్తున్న వాహనం భగీరథ విగ్రహం వద్దకు చేరుకోగానే, వరిగడ్డి విద్యుత్ తీగలకు తాకడంతో మంటలు చెలరేగినట్లు తెలిసింది. మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనంలోని జాక్ సాయంతో గడ్డిని పైకి లేపి, మంటలు మరింత వ్యాపించకుండా అక్కడక్కడా కింద పడవేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎంఆర్ఓ కార్యాలయ రోడ్డుపై కూడా వరిగడ్డి పడిపోవడంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టణ రహదారులపై ఎత్తుగా వరిగడ్డి, ఇతర సామగ్రిని తరలించే వాహనాల విషయంలో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- నారాయణపేటలో ఎస్పీ వినీత్ ఆధ్వర్యంలో భారీ సైకిల్ ర్యాలీ

ప్రజానావ, నారాయణపేట : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం, పాత బస్టాండ్, మెయిన్ చౌక్, సుభాష్ రోడ్డు, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి రోడ్డు, జిషాన్ హోటల్, అంబేద్కర్ చౌరస్తా, మున్సిపల్ పార్కు మీదుగా తిరిగి ఎస్పీ కార్యాలయ పరేడ్ మైదానం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పాల్గొన్నవారు 'జోహార్ పోలీసు అమరవీరులకు.. జోహార్' అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించే సందేశాన్ని చాటిచెప్పారు. అనంతరం ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు.



అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- నల్గొండ క్లాక్‌టవర్ వద్ద ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వాకథాన్

ప్రజానావ, నల్గొండ : అవినీతి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా నల్గొండ పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో భారీ వాకథాన్ నిర్వహించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్, ఏజీఎం డాక్టర్ రాఘవేంద్ర సింగ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధుల నిర్వహణలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అవినీతికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినప్పుడే సమగ్ర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరూ నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని సూచించారు. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.

సత్తుపల్లి శివకుమార్‌కు సేవారత్న పురస్కారం

ప్రజానావ, సత్తుపల్లి : సామాజిక సేవా రంగంలో విశేష సేవలందిస్తున్న సత్తుపల్లి పట్టణానికి చెందిన పోలిశెట్టి శివకుమార్ 2026 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సేవారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. నరసరావుపేటకు చెందిన విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఏటా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. నిరుపేదలకు అండగా నిలవడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, అంత్యక్రియల నిర్వహణకు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించడం వంటి సేవలతో గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన ఫౌండేషన్ సేవారత్న పురస్కారానికి ఎంపిక చేసింది. డిసెంబరు 20న నరసరావుపేటలో నిర్వహించే ఫౌండేషన్ వార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేయను న్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం, ఫౌండేషన్ సభ్యుడు, చింతలపూడి భాజపా అధ్యక్షుడు మాడా ఉమామహేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పురస్కారానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

మంజీరాలో తల్లి, ఇద్దరు కుమార్తెల గల్లంతు

- మృతదేహాలు లభ్యం
- ఏడుపాయల వద్ద విషాద ఘటన
- కుటుంబ సమస్యలపై ఆవేశపూరిత నిర్ణయాలు వద్దన్న డీఎస్పీ

ప్రజానావ, మెదక్ : మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనపూర్ శివారులోని ఏడుపాయల మొదటి వంతెన వద్ద మంజీరా నదిలో తల్లి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి గల్లంతైన విషాద ఘటన కలకలం రేపింది. కామారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన సరిత (25), ఆమె కుమార్తెలు వైష్ణవి, శ్రావణిక కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం సరిత గల్లంతైనట్లు ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సెల్‌ఫోన్ సంకేతాల ఆధారంగా ఏడుపాయల మొదటి వంతెన వద్ద ఆమె ఆచూకీ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. నది ఒడ్డున ముగ్గురికి చెందిన చెప్పులు, సెల్‌ఫోన్ లభించడంతో వారు నదిలో గల్లంతై ఉంటారని అనుమానించారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ, కొల్చారం ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పోలీసు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో చీకటి కారణంగా చర్యలను తాత్కాలికంగా నిలిపివేసి, బుధవారం ఉదయం తిరిగి ప్రారంభించారు. గాలింపు చర్యల్లో ముగ్గురి మృతదేహాలు లభించడంతో పోస్టుమార్టం నిమిత్తం మెదక్



ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల వివరాల ప్రకారం హైదరాబాద్‌లో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్న సరిత, ఆధార్ కార్డులో సవరణ చేయించుకునేందుకు పోచారంలో నివసిస్తున్న తన అక్క వద్దకు వచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనపై మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తల్లి ఇద్దరు పిల్లలతో కలిసి మంజీరా నదిలో గల్లంతైనట్లు సమాచారం అందగానే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారని, మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. కుటుంబ సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశంలో ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను విషాదంలోకి నెట్టవద్దని మహిళలు, యువతకు విజ్ఞప్తి చేశారు. ఏదైనా సమస్య ఎదురైతే పోలీసులను నేరుగా సంప్రదించి సహాయం పొందవచ్చని సూచించారు. కుటుంబ సమస్యల కారణంగా చిన్నారులను వెంటబెట్టుకొని ప్రాణాలు తీసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. పిల్లలను అనాథాశ్రమాలు, ప్రభుత్వ బాలసదనాలు లేదా వనితా గృహాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆవేశపూరిత నిర్ణయాలు చిన్నారుల జీవితాలనూ అంధకారంలోకి నెడతాయని డీఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు.



ఫోక్ ఇండస్ట్రీకి ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి

- సిరిసిల్లలో నవంబర్ 3న ఆవిర్భావ వేడుకలు
- మంత్రి వివేక్, ప్రభుత్వ విప్ ఐలయ్యలకు ఆహ్వానం

ప్రజానావ, సిరిసిల్ల: జానపద కళారంగానికి సినిమా రంగం తరహాలో ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారం అందించాలని తెలుగు ఫోక్ అసోసియేషన్ తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రతినిధులు రాష్ట్ర కార్మిక, బొగ్గు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలను కోరారు. బుధవారం హైదరాబాద్‌లో వారిని కలిసి, నవంబర్ 3న సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించారు. జానపద కళాకారులు సినిమా రంగానికి దీటుగా పాటలు రూపొందిస్తున్నప్పటికీ, పెట్టుబడుల భారం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై మంత్రి వివేక్, ప్రభుత్వ విప్ ఐలయ్య సానుకూలంగా స్పందించి, వేడుకలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా సిరిసిల్లలో ఈ వేడుకలు నిర్వహించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ ఎండీ సత్తార్, కోశాధికారి ఎర్రం గజ్వేల్ వేణు, ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత మండలాలను జాబితాలో చేర్చాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత మండలాల జాబితాలో చేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో కేవలం రెండు మండలాలనే జాబితాలో చేర్చడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావం, సాగునీటి కొరత, భూగర్భ జలమట్టాల తగ్గుదల నేపథ్యంలో అన్ని మండలాల్లో సమగ్ర శాస్త్రీయ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిరిసిల్లలో సినీ హీరో సంపూ సందడి



ప్రజానావ, సిరిసిల్ల : సీని హీరో సంపూర్ణేష్ బాబు బుధవారం సిరిసిల్లలో సందడి చేశారు. స్థానిక ఈశ్వరీ డెంటల్ క్లినిక్ ను సందర్శించి అక్కడ ఉన్న అభిమానులతో ముచ్చటించారు. యువత సంపూతో సెల్ఫీలు తీసుకున్నారు. ప్యారడైజ్ మూవీ విజయవంతం చేసిన అభిమానులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరికి హాస్యాన్ని అందించిన కొబ్బరి మట్ట చిత్రాన్ని నవంబరు 14న రీ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే తాను నటిస్తున్న మరో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇక్కడ మానేరు స్వచంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, డాక్టర్ ఆకాంక్ష తదితరులు ఉన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.38 కోట్లు



ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు పూర్తయింది. గత 40 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1,38,24,600 నగదు ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. వీటితో పాటు 66 గ్రాముల 200 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 550 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఆలయ డీఈవో నవీన్ కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పోలీసులు, శ్రీ శివరామకృష్ణ భజన మండలి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం

ప్రజానావ, సిరిసిల్ల: డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాల పై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నియంత్రణ, గంజాయి సాగు నివారణ, ఎన్డీపీఎస్ కేసులు, డీ అడిక్షన్ కేంద్రంలో వైద్య సేవలపై చర్చించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 10 డిగ్రీ, 20 జూనియర్ కళాశాలల్లో సుమారు 2,600 మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాలల్లోనూ విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నిరంతర తనిఖీలు చేపడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి. గితె తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బీ. కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

- విద్యార్థులు, యువత, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఉత్సాహంగా 2కే రన్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సిరిసిల్లలో 2కె రన్



ప్రజానావ, సిరిసిల్ల : ప్రజల క్షేమం, రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే కోరారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు 2కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయ మని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాల ను ప్రజలకు తెలియజేయడంతో పాటు, పోలీసుల సేవలు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే సవాళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమేనన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాలను గౌరవించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ 2కె రన్ లో డిఎస్పీ లు నాగేంద్ర చారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సిఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, ఆర్ఐ మధుకర్, ఎస్ఐ లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.

గూడూరు అటవీ శాఖ కార్యాలయంలో చోరీ

- స్వాధీనం చేసుకున్న వేట సామగ్రి మాయం
- అధికారుల పాత్రపై అనుమానాలు



ప్రజానావ, గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో అటవీ శాఖకు చెందిన వేట సామగ్రి చోరీకి గురికావడం కలకలం రేపింది. వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అధికారులు వేటగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఉచ్చులు, ఇతర వేట పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వివరాల్లోకి వెళ్తే.. గూడూరు మండల అటవీ ప్రాంతంలో ఇటీవల వన్యప్రాణుల వేట పెరుగుతున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి వేటకు ఉపయోగించే ఉచ్చులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని మండల కేంద్రంలోని ప్రధాన అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరచాల్సి ఉండగా, అటవీ శాఖ సెక్షన్, బీట్ అధికారులు భీముని పాదం వద్ద ఉన్న ఓ గదిలో ఉంచినట్లు సమాచారం. ఆ గది కిటికీలను, తాళాలను పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు లోపల ఉన్న వేట సామగ్రితో పాటు ఇతర వస్తువులను అపహరించారు. ఈ విషయాన్ని గుర్తించిన అటవీ శాఖ సెక్షన్, బీట్ అధికారులు గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని ప్రధాన కార్యాలయంలో కాకుండా మరోచోట ఎందుకు భద్రపరిచారనే అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ చోరీ వెనుక అటవీ శాఖలోని కొందరు సిబ్బంది పాత్ర ఉండొచ్చంటూ ప్రచారం సాగుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. వేటగాళ్లతో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, చోరీకి పాల్పడిన వ్యక్తులకు స్థానిక నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారంపైనా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అటవీ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గూడూరు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి పట్టుకుంటామని వెల్లడించారు. గూడూరు మండలంలో వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వేట సామగ్రిని అపహరించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వన్యప్రాణి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

- పరకాలలో ఎరువుల దుకాణం ఎదుట రైతుల ఆందోళన

ప్రజానావ, పరకాల : నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయామని ఆరోపిస్తూ పరి రైతులు హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని విక్రమ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. శాయంపేట మండలానికి చెందిన మూడు గ్రామాల రైతులు సుమారు 150 ఎకరాల్లో డబ్ల్యూజీ ఎల్ 44 సిద్ధి రకం వరి విత్తనాలను సాగు చేశామని, ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినా ఇప్పటివరకు పంట గొలుసు కూడా వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు నకిలీవి కావడం వల్లే పంట ఎదుగుదల లేక తీవ్రంగా నష్టపోయామని ఆరోపించారు. విత్తనాలు విక్రయించిన దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని, పంట నష్టపో యిన రైతులందరికీ తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ దుకాణం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టం అంచనా వేయాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.



బిచ్కుంద అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులకు ఆటంకాలు కల్పించొద్దు
- ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజినీర్ వినోద్

ప్రజానావ, బిచ్కుంద : కామారెడ్డి జిల్లా బిచ్కుంద పట్టణ రూపురేఖలు మార్చే లక్ష్యంతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులకు పట్టణవాసులు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా సహకరించాలని ఆర్ అండ్ బీ డిప్యూటీ ఇంజినీర్ వినోద్ కోరారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం రాత్రి బిచ్కుంద ఎస్సై గుండెల రాజు, స్థానిక నాయకులతో కలిసి వివిధ కాలనీల వాసులతో సమావేశమ య్యారు. నిర్మాణ పనుల్లో భాగంగా యూ టర్న్‌ల ఏర్పాటు విషయంలో ప్రజల అభిప్రాయాలను తెలు సుకున్నారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, వాహనదారులకు సౌకర్యవంతంగా ఉండేలా యూ టర్న్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బస్టాండ్ సమీపంలోని మైనార్టీ కాలనీకి వెళ్లేందుకు ఒక యూ టర్న్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిప్యూటీ ఇంజినీర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వినోద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రమాదాలు జరగ కుండా, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి సర్వే నిర్వహించిన అనంతరం యూ టర్న్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అవసరమైన చర్యలు చేపడతామని, నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పట్టణానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అసద్ అలీ, ప్రేమ్ సెట్, సాహెల్ సెట్కార్, ఖలీల్ పాషా, కౌన్సిలర్లు ముజాహిద్, పరశురామ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో నాలుగు కరువు మండలాల గుర్తింపు

- రాష్ట్రవ్యాప్తంగా 365 మండలాలు కరువు ప్రభావితం
- సహాయక చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు
- రైతులకు అవసరమైన సహాయం అందించేలా చర్యలు

ప్రజానావ, ములుగు : రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం 31 జిల్లాల పరిధిలో 365 కరువు ప్రభావిత మండలాలను గుర్తించింది. వీటిలో 111 మండలాల్లో తీవ్ర కరువు ప్రభావం ఉండగా, మరో 254 మండలాల్లో మోస్తరు ప్రభావం ఉన్నట్లు వెల్లడించింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగా ములుగు జిల్లాలో నాలుగు మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. గోవిందరావు పేట, ఏటూరునాగారం, వెంకటాపురం, మంగపేట మండలాల్లో పరిస్థితులను బట్టి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, రైతులకు అవసరమైన సహాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

మోదీపై వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

- పరకాలలో బీజేపీ నాయకుల ఆందోళన
- రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని నిరంజన్ సూచన

ప్రజానావ, పరకాల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపు మేరకు పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ నేతృత్వంలో పరకాల బస్టాండ్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి పట్ల కనీస గౌరవం పాటించని రాజకీయ భాష ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంతీలాల్, పరకాల మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, నాయకులు వెనిశెట్టి శారద, పిట్ట కిషోర్, దంచనాదుల సత్యనారాయణ, ముత్యాల దేవేందర్, మెంతుల సురేష్, దామ సతీష్, కక్కు రాజు, సల్పల సురేష్, రంతుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





బాన్సువాడలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- గ్రామ పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాలకు భూమిపూజ
- విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

ప్రజానావ, బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, రాష్ట్ర మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్స వాలు, భూమిపూజలు నిర్వహించారు. బాన్సువాడ గ్రామీణ మండలం కొయ్యగుట్ట తండాలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని మూడో వార్డులో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామ శివారులో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రగతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ బాలరాజు, కౌన్సిలర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బాలల రక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజానావ, వేములవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్షిత్ బచ్పన్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, బాలలపై లైంగిక నేరాల నివారణకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్ మాట్లాడుతూ, చిన్న వయసు నుంచే చట్టాలపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఏపీపీ అవధూత రజనీకాంత్ పోక్సో చట్టంపై వివరించారు. మహిళా న్యాయవాది తమిరి అన్నపూర్ణ బాలలపై నేరాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గొంటి శంకర్, జాయింట్ సెక్రటరీ కనికరపు శ్రీనివాస్, న్యాయవాదులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రైతు గర్జన సభ పోస్టర్లు ఆవిష్కరణ

కేటీఆర్ హాజరు.. 50 వేల మందితో సభ నిర్వహణకు సన్నాహాలు

ప్రజానావ, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో నవంబర్ 1న నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు గర్జన బహిరంగ సభ పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నేత భార్గవ్ దేశ్‌పాండే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న ఈ బహిరంగ సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. సభకు సుమారు 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ నిర్వహించనున్న ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆశా వర్కర్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- 2026 లెప్రసీ సర్వేకు అదనపు పారితోషికంపై ఉత్తర్వులు జారీ చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

ప్రజానావ, సిరిసిల్ల : 2023–24 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే, పల్స్ పోలియో బకాయిలను ఆశా వర్కర్లకు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. నెలకు రూ.9,900 పారితోషికంతో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు అదనపు సర్వే పనులకు ప్రత్యేక పారితోషికం చెల్లించాలని కోరారు. 2026 లెప్రసీ సర్వేకు అదనపు డబ్బులు చెల్లిస్తామని హెల్త్ కమిషనర్ నుంచి అధికారిక ఉత్తర్వులు వచ్చే వరకు సర్వేలో పాల్గొనబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ సూరం పద్మతో పాటు భారతి, జయశీల, భూలక్ష్మి, లత, దేవిక, రమణ తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఏఐ పేరు మారుస్తూ ట్రంప్ సంచలన నిర్ణయం

- 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'కు బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్'
- అధికారిక పత్రాల్లో కొత్త పదం వాడాలని ఆదేశం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రాచుర్యంలో ఉన్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) అనే పదానికి బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్' (ఎస్ఐ) అనే పదాన్ని ఉపయోగించాలని సూచించారు. 'ఆర్టిఫిషియల్' అనే పదం సాంకేతిక పరిజ్ఞానం సామర్థ్యాలను సరిగ్గా ప్రతిబింబించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ పేరును మార్చాలన్న ప్రతిపాదనను ట్రంప్ గత నెలలోనే తెరపైకి తెచ్చారు. తాజాగా అమెరికా ప్రభుత్వ విభాగాలు, సంస్థలు తమ అధికారిక కార్యకలాపాలు, పత్రాల్లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్', 'ఏఐ' పదాలకు బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్', 'ఎస్ఐ' పదాలను ఉపయోగించాలని ఆదేశించినట్లు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పదజాలంలో మార్పు తీసుకురావాలన్న ఈ ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది. అయితే, ఈ ఆదేశం పరిధి, అమలు వివరాలను అధికారిక ప్రకటన ఆధారంగా నిర్ధారించాల్సి ఉంది.

పురుషులకూ గర్భనిరోధక మాత్ర

- అమెరికా శాస్త్రవేత్తల పరిశోధనలు
- లైంగిక చర్యకు అరగంట ముందు తీసుకుంటే 6-8 గంటల పాటు ప్రభావం



న్యూఢిల్లీ : త్వరలో పురుషుల కోసం కూడా గర్భనిరోధక మాత్ర అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా అమెరికా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తున్నారు. లైంగిక చర్యకు సుమారు 30 నిమిషాల ముందు ఈ మాత్ర తీసుకుంటే ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు వీర్యకణాల పనితీరును తాత్కాలికంగా అడ్డుకోవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అమెరికాలోని వెయిల్ కార్నెల్ మెడిసిన్ పరిశోధకులు ఈ ఔషధ అభివృద్ధిపై పనిచేస్తున్నారు. వీర్యకణాల కదలికకు అవసరమైన సాల్యూబుల్ అడెనైలిల్ సైక్లేజ్ (ఎస్ఏసీ) అనే ఎంజైమ్ పనితీరును ఈ ఔషధం తాత్కాలికంగా నిరోధిస్తుంది. దీంతో వీర్యకణాలు అందాన్ని చేరి ఫలదీకరణం జరిపే అవకాశాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. ఎలుకలపై నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో ఈ విధానం గర్భధారణను తాత్కాలికంగా నిరోధించినట్లు గుర్తించారు. ఔషధ ప్రభావం తగ్గిన తర్వాత సంతానోత్పత్తి సామర్థ్యం తిరిగి సాధారణ స్థితికి వచ్చినట్లు పరిశోధకులు వెల్లడించారు. అయితే, ఇది ఇంకా పరిశోధన దశలోనే ఉండటంతో మనుషుల్లో భద్రత, ప్రభావశీలతను నిర్ధారించేందుకు మరిన్ని అధ్యయనాలు అవసరం.

హౌతీలతో ఒప్పందానికి సౌదీ యత్నం?

- రూ.9,500 కోట్ల చెల్లింపునకు సిద్ధమైనట్లు ప్రచారం
- రియాద్ రక్షణ శాఖ భవనంపై క్షిపణి దాడి చేసినట్లు హౌతీల ప్రకటన



రియాద్ : యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో సతమతమవుతున్న సౌదీ అరేబియా వారితో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తమ దేశంపై దాడులు నిలిపివేసేందుకు హౌతీలకు రూ.9,500 కోట్లు చెల్లించేందుకు సౌదీ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై చర్చలు జరిపేందుకు సౌదీ రక్షణ శాఖ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు చేరుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. మంత్రి ప్రయాణించిన హెర్క్యులెస్ సైనిక విమానంలోనే ఈ మొత్తాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నాయి. అయితే ఈ చెల్లింపులు, ఒప్పంద ప్రయత్నాలకు సంబంధించిన వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. సౌదీ రాజధాని రియాద్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై బాలిస్టిక్ క్షిపణితో నేరుగా దాడి చేసినట్లు హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. తమ సైనిక బలగాలు రక్షణ శాఖ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణిని ప్రయోగించాయని హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరియా సామాజిక మాధ్యమంలో వెల్లడించారు. క్షిపణి లక్ష్యాన్ని నేరుగా తాకిందని పేర్కొన్నారు. అయితే ఈ వాదనను నిర్ధారించే ఆధారాలు అందుబాటులో లేవు. దాడిలో భవనానికి నష్టం వాటిల్లిందా? ప్రాణనష్టం జరిగిందా? అనే వివరాలు కూడా స్పష్టంగా తెలియరాలేదు. మరోవైపు హౌతీలు ప్రయోగించిన రెండు క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. ఇదిలా ఉండగా, సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన రాస్ తనూరా రిఫైనరీపై కూడా క్షిపణి దాడి చేసినట్లు హౌతీలు వెల్లడించారు. ఈ దాడి కారణంగా అక్కడ మంటలు చెలరేగినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు మరింత పెరిగాయి.

వార్తల ప్రచురణకు వ్యక్తుల అనుమతి తీసుకోవాలా?

- డీపీడీపీ చట్ట నిబంధనలపై డీఎన్‌పీఏ అభ్యంతరం
- పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని సుప్రీంకోర్టుకు విన్నపం
- కేంద్రానికి నోటీసులు



న్యూఢిల్లీ : డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం (డీపీడీపీ) నిబంధనల ప్రకారం వార్తలు ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తుల అనుమతి తీసుకోవాల్సి వస్తే వార్తాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) సుప్రీంకోర్టుకు తెలిపింది. జర్నలిస్టుల వార్తా సేకరణ, పరిశోధనాత్మక కథనాల ప్రచురణకు ఈ చట్టంలో ప్రత్యేక మినహాయింపులు లేకపోవడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ. మోహన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం డీఎన్‌పీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. ఈ సందర్భంగా కేంద్ర న్యాయశాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికశాఖలకు నోటీసులు జారీ చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వ వాదనలు వినకుండా చట్టంపై మధ్యంతర స్టే విధించేందుకు నిరాకరించిన ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది.

వార్త ప్రచురణకు ముందస్తు అనుమతా?

డీఎన్‌పీఏ తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ.. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపు లేకపోవడం వల్ల వార్తల ప్రచురణ విధానమే మారిపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రచురించే ముందు వారి అనుమతి తీసుకోవాలని జర్నలిస్టులను ఆదేశిస్తే వార్తాసంస్థలు స్వేచ్ఛగా పనిచేయలేవని పేర్కొన్నారు. వార్తల కోసం సంబంధిత వ్యక్తుల అనుమతి తీసుకోవాల్సి వస్తే వార్తా గదులు మూతపడతాయని, అది ముందస్తు సెన్సార్ విధానంతో సమానమని వాదించారు. ఒక వ్యక్తిపై వార్త రాయడానికి అతడి అనుమతి తీసుకోవాలంటే జర్నలిజం ఉద్దేశమే దెబ్బతింటుందని ప్రశ్నించారు. తప్పుడు, అసత్య, నిరాధార వార్తలు ప్రచురిస్తే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని, అయితే వార్త ప్రచురణకు ముందే అనుమతి పొందాలనే నిబంధన సరికాదని స్పష్టం చేశారు. గతంలో రూపొందించిన సమాచార రక్షణ చట్ట ముసాయిదాల్లో జర్నలిజానికి మినహాయింపు ఉండేదని, ప్రస్తుత చట్టంలో దాన్ని ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

